# సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహశీల్దార్.



**తనకల్లు జూన్ 4 (నేటి దర్శిని)**
తనకల్లు మండల కేంద్రంలోని తారకరామా నగర్ లో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని తనకల్లు మండల తహశీల్దార్ బండి సురేంద్రనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటును పదిల పరచుకోవాలని ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, కాబట్టి బిఎల్వోలు. ఆయా సంబంధిత బూత్ కమిటీ కన్వీనర్లు. పాల్గొని ఓటు ఉన్న ప్రతి ఒక్కరికి ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బండి సురేంద్రనాథ్, బిఎల్వోలు. బూత్ కమిటీ కన్వీనర్లు తోట సరోజమ్మ, చాకివేల శిరీష, ఓటర్లు పాల్గొన్నారు.

# 8 నెలలుగా జీతాలు లేవు.. మంత్రి కేశవ్‌కు కార్మికుల వినతి



**ఉరవకొండ జూన్ 4 (నేటి దర్శిని)**
నింబగల్లు బహుళార్థక సురక్షిత నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న తమకు గత ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్, సీసీడబ్ల్యూఎస్ పథకం కార్మికులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శనివారం పెద్దకౌకుంట్ల గ్రామంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వారు తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 24 ఏళ్లుగా 21 మంది ఈ పథకంలో పనిచేస్తున్నప్పటికీ గత ఎనిమిది నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ, ఇంటి అద్దెలు, పిల్లల చదువుల ఖర్చులు భరించడం కష్టంగా మారిందన్నారు. షెడ్యూల్ ప్రకారం రూ.27,700 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.12 వేలే చెల్లిస్తున్నారని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని వెంటనే స్పందించిన మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి, కార్మికులకు పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి కార్మికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో ఎలుగుబంట్ల కలకలం

**ప్రజల్లో భయాందోళన**



**శ్రీ సత్యసాయి జిల్లా జూన్ 4 (నేటి దర్శిని)**
శ్రీ సత్యసాయి జిల్లాలోని గుడిబండ మండల కేంద్రంలో ఎలుగుబంట్ల సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఎస్సీ కాలనీలో వరుసగా మూడు రోజులుగా ఎలుగుబంట్లు కనిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. తాజాగా రాత్రి సమయంలో ఓ ఎలుగుబంటి కాలనీలోకి చొరబడి ఓ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. ఇది గమనించిన స్థానిక యువకులు వెంటనే కేకలు వేయడంతో అప్రమత్తమైన వారు కర్రల సహాయంతో ఎలుగుబంటిని తరిమికొట్టారు. దీంతో అది తిరిగి సమీపంలోని కొండ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనలతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలుగుబంట్ల సంచారం కొనసాగితే ప్రమాదం తప్పదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రామ్ నుంతల గ్రామపంచాయతీలో హర్ ఘర్ జల్

**ఆమనగల్లు, జూన్ 4 (నేటి దర్శిని)**



ఆమనగల్లు మండల పరిధిలోని రామ్నుంతల గ్రామపంచాయతీ లో శనివారం'హర్ ఘర్ జల్' అనే కార్యక్రమాన్ని సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్, మిషన్ భగీరథ ఏఈ జయశ్రీ తో కలిసి నిర్వహించారు. రామునుంతల గ్రామపంచాయతీలో ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రతి గ్రామీణ కుటుంబానికి, ప్రతి ఇంటికి సురక్షితమైన కులాయి నీటిని నిరంతరాయంగా అందించడమే దీని ఉద్దేశమని సర్పంచ్ శ్రీను నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్,వార్డు సభ్యులు ధనరాజ్ గ్రామ కార్యదర్శి యాదగిరి,మాజీ వార్డు సభ్యులు కృష్ణ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఐకమత్యంతోనే హక్కుల సాధన సాధ్యం





**--జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే**

**- ఘనంగా నగర మహాసభ**

**- నగర అధ్యక్షులుగా నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా గా మల్లికార్జున ఎన్నిక**





**కర్నూలు, జూన్ 4 (నేటి దర్శిని)**
ఐకమత్యంతోనే హక్కుల సాధన సాధ్యమని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ కొండప్ప, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి అంజి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, సీనియర్ జర్నలిస్టు శ్రీనాథ్ అన్నారు. శనివారం నగరంలోని సీ క్యాంప్ నందు ఉన్న ఏపీ ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో ఏపీయూడబ్ల్యూజే నగర మహాసభ జరిగింది. ఈ మహా సభకు జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్ట భద్రత, సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. అధికారంలో ఎవరు ఉన్నా.. జర్నలిస్టుల సమస్యమే మిన్నగా భావిస్తూ.. ముందుకు వెళుతున్నామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్ క్లబ్ లు ఉన్నాయని, కర్నూలు నగర కేంద్రంలో మాత్రం ఇంత వరకు ప్రెస్ క్లబ్ లేకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులందరిని కలుపుకొని ప్రెస్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే జర్నలిస్టులకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని కూటమి ప్రభుత్వం తమ మానిఫెస్టో లో పెట్టిందని, ఎన్నికల ముందు కాకుండా ఇప్పుడే అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2026 – 2027 కు సంబంధించి ఏపీయూడబ్ల్యూజే సంఘం సభ్యత్వం మొదలు పెట్టబోతున్నామని, ప్రతి ఒక్కరు తమ సభ్యత్వం రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. అలాగే కొత్తగా సభ్యత్వం తీసుకోవాలని అనుకునే వారు కూడా తీసుకోవచ్చన్నారు. రెన్యువల్ చేయించుకోవాలనుకునే వారు రూ.150, కొత్తగా తీసుకునే వారు రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అందరూ సభ్యత్వం తీసుకొని జర్నలిస్టుల ఐక్యత చాటాలని కోరారు. అనంతరం నగర నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నగర నూతన కమిటీ:**

ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్షులుగా నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా బీ మల్లికార్జున, కోశాధికారిగా శివ, ఉపాధ్యక్షులుగా రమేష్, ఆసిఫ్, ఎల్లగౌడ్, సహాయ కార్యదర్శులు గా రమేష్ రెడ్డి, రవిరాజ్, సూరి కార్యవర్గ సభ్యులు గా మధు సుధన్ రాజ్, నాగేంద్ర, గజేంద్ర లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే నగర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులను శాలువా, మెమెంటో లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఫీ, అంజి పలువురు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

**-జగన్‌కు గుడిసె ఆది కృష్ణమ్మ సవాల్**




**కర్నూలు, జూలై 4 జూన్ 4 (నేటి దర్శిని)**
రాయలసీమ అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో జరిగిన పనులు, 2019--2024 మధ్య మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి సవాల్ విసిరారు. కర్నూలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు ఇటీవల పూజా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయడానికి తొలి దశలో రూ.4,500 కోట్లు, రెండో దశలో రూ.11,850 కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించారని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, దక్షిణ భారతదేశంలో తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఉక్కు ఉత్పత్తి చేసే ఆధునిక పరిశ్రమగా ఇది నిలుస్తుందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చి, రెండు సార్లు శంకుస్థాపనలు చేసినప్పటికీ ఐదేళ్లలో ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి సాధించలేదని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌కు కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించలేదని ఆరోపించారు. రాయలసీమలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని తెలిపారు. హంద్రీ–నీవా విస్తరణతో పాటు తుంగభద్ర, గోరకల్లు, శ్రీశైలం తదితర సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ప్రాంతీయ అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు.

# విజిలెన్స్ కమిటీలపై మురికిపూడి ప్రసాద్ విమర్శలు

**-రాజకీయ పునరావాస కేంద్రాలుగా పౌరసరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ కమిటీలు**

**-నిబంధనలు విస్మరించి రాజకీయ ఒత్తిళ్లతో నియామకాలు జరిగాయని ఆరోపణ**



**నరసరావుపేట, జూన్ 4 (నేటి దర్శిని)**
పౌరసరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుల నియామకంలో నిబంధనలు పాటించకుండా రాజకీయ ఒత్తిళ్లకు లోబడి నియామకాలు చేపట్టారని సీఆర్పీఎఫ్ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్ ఆరోపించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర విజిలెన్స్ కమిటీలలో వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెం. 8 ప్రకారం వినియోగదారుల వ్యవహారాలతో సంబంధం లేని వ్యక్తులను కొన్ని జిల్లాల విజిలెన్స్ కమిటీలలో నియమించడం చట్ట స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఈ నియామకాల ద్వారా రాజకీయంగా అవకాశాలు లేని వ్యక్తులకు పదవులు కల్పించినట్లు కనిపిస్తోందని, అయితే పదవులు పొందిన వ్యక్తులపై తమకు ఎలాంటి వ్యక్తిగత వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవకాశం కల్పించి ఉంటే విజిలెన్స్ కమిటీల ఏర్పాటు వెనుక ఉన్న అసలు ఉద్దేశం నెరవేరేదని అభిప్రాయపడ్డారు. గత నెల 30న విడుదల చేసిన జీవో ఎంఎస్ నెం.8లో కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులను నియమించినట్లు, సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్ల సిఫార్సుల మేరకు ఈ నియామకాలు జరిగాయని పేర్కొనడం గమనార్హమని అన్నారు. అయితే నియమితులైన వ్యక్తులు నిజంగా వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులేనా అనే విషయాన్ని ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.8ను పునఃసమీక్షించి, అవసరమైతే ఉపసంహరించుకుని నిబంధనలకు అనుగుణంగా కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల సంఘాలు ఏకమై చట్టబద్ధమైన మార్గాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తాయని మురికిపూడి ప్రసాద్ తెలిపారు.

